## క్లుప్తంగా

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో 'పల్లెపల్లెకు ఓబీసీ- ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఓబీసీల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు పుప్పాల శివరాజ్, జీవీ నర్సింహారెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి, బాశెట్టి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బాలల సంరక్షణ కేంద్రానికి శిశువు అప్పగింత



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన బర్కుంట సాయన్న-స్వరూపల మూడో సంతనమైన 11రోజుల మగ శిశువును సోమవారం జిల్లా బాలల సంరక్షణకేంద్రం అధికారులకు అప్పగించారు. బాలుడిని పోషించే ఆర్థిక స్థోమత లేకపోవడంతోనే బాలల సంరక్షణ కేంద్రానికి అప్పగించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. తల్లిదండ్రులకు బాలల సంరక్షణ కేంద్ర అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ గోపిడి సుజాత సమక్షంలో శివువు తీసుకెళ్లారు. ఉప సర్పంచ్ గంగారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ విలువలను గౌరవించాలి

డిచ్‌పల్లి: ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ విలువలను గౌరవించాలని ఎస్‌జెడబ్ల్యూహెచ్ ఆర్‌సీ సౌత్ ఇండియా వర్కింగ్ కమిటీ చైర్మెన్ హన్మాగౌడ్ అన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో సోమవారం మానవ హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, వర్గ, వర్ణ, లింగ వివక్ష చూపడం నేరం అన్నారు. సంస్థ సభ్యులు మాలెపు నారాయణ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వీణరాణి, మహిళా సామాజిక కార్యకర్త పుప్పాల గీత ధర్మారం ప్రజలు పాల్గొన్నారు.

### లింగనిర్ధారణ పరీక్షలు నేరం



సిరికొండ: పుట్టబోయేది ఆడబిడ్డా, మగబిడ్డా అని తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని ఆరోగ్య విస్తీర్ణాధికారి వెంకటేష్ తెలిపారు. సిరికొండలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ 1994పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ.. పుట్టబోయేది ఆడబిడ్డా, మగబిడ్డా అని అడిగిన వారికి, ప్రోత్సహించిన వారికి, పరీక్షల వివరాలు చెప్పిన వారికి ఐదు సంవత్సరాల వరకు జైలుశిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. సీహెచ్‌వో అనంత్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రియదర్శిని, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నేతల కాగడాల ర్యాలీ



సిరికొండ: మండలంలోని న్యావనంది గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వంను రద్దును నిరసిస్తూ ఈ ప్రదర్శన చేపట్టారు. ర్యాలీలో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవి, నాయకులు ఎర్రన్న, బాల్‌రాజ్‌నాయక్, జనార్దన్, నరేందర్, సంతోష్, దాసు, ప్రశాంత్, చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇందల్వాయి: మండలంలోని ప్రజలు చోరీలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేష్ ఒక ప్రకటనలో సూచించారు. మండలంలో గత కొద్ది రోజులుగా వరుస దొంగతనాలతో పాటు, పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నందున రైతులు పొలాల వద్ద గస్తీ నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో దొంగతనాలు అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

# సంత.. సమస్యల చింత

- బోధన్ సంతలో రోడ్డుపైనే దుకాణాలు
- కనీస వసతులు లేక ఇబ్బందులు



బోధన్ పాత బస్టాండ్ సమీపంలోని సంతలో రోడ్డుపైనే ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణాలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోగల నిర్వహించే సంత సౌకర్యాల లేమితో సమస్యల చింతగా మారింది. ప్రతీ ఆదివారం నిర్వహించే సంతకు అనువైన స్థలం లేకపోవడంతో గోశాల కాలనీలోగల రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించే పరిస్థితి నెలకొంది. కూరగాయలు అమ్మేవారికి కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో సుమారు 75ఏళ్లకు పైగా ఈ సంత కొనసాగుతుంది. ఈ సంతకు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి సైతం కూరగాయల వ్యాపారులు వస్తుంటారు.

**తైబజార్ వేలం వేస్తున్నా..**

సంతలో ఏర్పాటు చేసే దుకాణాలకు తైబజార్ నిర్వహకులు దుకాణం ఏర్పాటు చేసే స్థలాన్ని బట్టి డబ్బులు వసూలు చేస్తారు. ప్రతీరోజు ఏర్పాటు చేసే దుకాణానికి రూ. 30, కొంచం రోడ్డు దగ్గరైతే 40, రోడ్డుపై ఏర్పాటు చేస్తే రూ. 50 వసూలు చేస్తున్నారు. మార్కెట్‌లో ప్రతీరోజు ఏర్పాటు చేసే దుకాణాలకు మాత్రం రూ. 20 వసూలు చేస్తారు. 2023-2024 తైబజార్ నిర్వహణ కోసం బల్దియా రూ. 21లక్షలకు అప్పగించింది. గత ఏడాది సైతం రూ. 21 లక్షలకు టెండర్ నిర్వహించారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరానికి 10 శాతం పెంచాల్సి ఉండగా సంత ఏర్పాటు కోసం అనువైన స్థలం లేకపోవడంతో పాటు ఇప్పుడు ఉన్న మార్కెట్ స్థలం సరిపోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని, ఈయేడు పెంచితే తాము టెండర్ నుంచి నిష్క్రమిస్తామని నిర్వహకులు బల్దియా అధికారులకు తెలిపారు. దీంతో బల్దియా అధికారులు తైబజార్ వేలం 10శాతానికి పెంచకుండా గత యేడాది వచ్చిన వేలానికే నిర్వహకులకు అప్పగించారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి సంతకు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేసి కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారుల సమస్యలను పరిష్కరించాలని, తైబజార్ నిర్వహకుల చింతను తీర్చాలని కోరుతున్నారు.

### సంతలో 500లకు పైగా దుకాణాలు

ఆదివారం వచ్చిందంటే గోశాల రోడ్డు పూర్తిస్థాయిలో దుకాణాలతో నిండి పోతుంది. సంతలో సుమారు 500 పైగా దుకాణాలు ఉంటాయి. దీంతో వ్యాపారులకు, కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. బల్దియా ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి కూరగాయ వ్యాపారుల కోసం గదులు నిర్మించినా.. అందులో కొన్ని మాత్రమే ఉపయోగంలోకి వచ్చాయి. మరి కొన్ని ఖాళీగానే ఉన్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వ్యాపారులకు తినడానికి సైతం భోజనశాల లేకపోవడంతో దుమ్ముధూళిలోనే తినాల్సిన పరిస్థితి నెలకొంది. మంచినీటికి సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం





బోధన్‌లో ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు.. ఆర్మూర్‌లో మాట్లాడుతున్న పండిత్ వినీత

**ఘనంగా పోషణ పక్షం ముగింపు కార్యక్రమం**

బోధన్‌రూరల్(బోధన్): నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మహిళా కమిషన్ సభ్యురాలు సుధాం లక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బోధన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ పక్షం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బందిని సుధాం లక్ష్మి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిత్య జీవితంలో చిరుధాన్యాల ఉపయోగం, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించాల్సిన పోషకాలపై అవగాహన కల్పించారు. సీడీపీవో జానకమ్మ, ఎంపీడీవో శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎనలేని పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలను కిశోర బాలికలకు నిత్యం అందజేయాలన్నారు. అనంతం వయసుకు అనుగుణంగా ఎత్తు, బరువు ఉన్న కిశోర బాలికలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. అలాగే మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. సీడీపీవో భార్గవి, వైద్యులు అజయ్, తిరుపతి, అంగన్వాడీ సూపర్ వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

### ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్‌లో సోమవారం శివాజీ విగ్రహం వద్ద గ్రామంలోని యువకులు ఘన నివాళులు అర్పించారు. శివాజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. భారతదేశంలో హిందూ రాజ్యస్థాపన కోసం పోరాటం చేసినట్లు తెలిపారు.

# దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి





నందిపేటలో నివాళులు అర్పిస్తున్న కురుమ సంఘ సభ్యులు.. కల్దుర్కి గ్రామంలో..

నందిపేట్(ఆర్మూర్): తెలంగాణ అమరవీరుడు దొడ్డి కొమురయ్యకు కురుమసంఘ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో సోమవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డికొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్మూర్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు కేజీ సురేష్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు.

బోధన్‌రూరల్(బోధన్): సాలూర, బోధన్ మండలాల్లో దొడ్డి కొమురయ్య జయంతిను ఘనంగా నిర్వహించారు. కల్దుర్కి గ్రామంలో కురుమ కులస్తులు ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. బోధన్ ఏఎంసీలో, సాలూర మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు దొడ్డి కోమరయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

మోర్తాడ్: మోర్తాడ్‌లో దొడ్డి కొమురయ్య జయంతిని దళిత సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం గురించి వివరించారు.

# పది పరీక్షలు ప్రారంభం



వర్నిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్(ఆర్మూర్)/నందిపేట్/రుద్రూర్/రెంజల్/ఎడపల్లి/వేల్పూర్/కమ్మర్‌పల్లి/బాల్కొండ: వర్ని/బోధన్‌టౌన్/నవీపేట: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలో 14 పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 1,955 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,948 మంది విద్యార్థులు హాజరయ్యారు. నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లోని 8 పరీక్ష కేంద్రాల్లో 868మంది విద్యార్థులకు గాను 866 మంది పరీక్ష రాశారు. ఎడపల్లి మండలంలో 290మంది విద్యార్థులకు గాను ఒకరు గైహాజరయ్యారు. నవీపేటలో మండలంలో వందశాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బోధన్ మండలంలో 13 పరీక్షా కేంద్రాల్లో 2789 మంది పరీక్షాకు హాజరు కావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరు అయ్యారు. 150 మంది ఇన్విజిటేర్లుగా విధులు నిర్వహించినట్లు , పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపారు.రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్ ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి చేరుకుని విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. వర్నిలో 246 మందికి ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు కాగా, జాకోర హైస్కూల్లో 130 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. చందూరులో 289 మందికి ఒకరు, మోస్రాలో 120 మందికి ఇద్దరు, రుద్రూర్లో 141 మందికి ఒకరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కోటగిరి మండలంలో 466విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరైయ్యారు.బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల పరిధిలో 1076 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1075 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కమ్మర్‌పల్లి మండలంలో 416 మంది విద్యార్థులకు గాను 415 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వేల్పూర్ మండలంలో 424 మంది పరీక్షకు హాజరయ్యారు.

**పరీక్ష కేంద్రం వద్దకు ఆర్టీసీ బస్సు..**

బోధన్‌లో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం రోజు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు ఆసరాగా నిలిచింది. నాందేడ్ నుంచి బోధన్ రూట్‌లో వచ్చే బోధన్ డిపో ఆర్టీసీ బస్సులో 10వ తరతగతి విద్యార్థులు ఎక్కడంతో ఆర్టీసీ డ్రైవర్ విద్యార్థులకు ఇబ్బంది కాకుండా పట్టణంలోని పరీక్ష కేంద్రం వద్దకు విద్యార్థులను వదిలి వెళ్లారు.



బోధన్‌లోని పరీక్షకేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



నవీపేటలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్



వేల్పూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



బాల్కొండ మండలకేంద్రంలో..



బోధన్‌లోని పరీక్షా కేంద్రం వద్దకు విద్యార్థులను తీసుకువచ్చిన ఆర్టీసీ బస్సు

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చిన్నారెడిని అభినందిస్తున్న జడ్జి నసీమా సుల్తానా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కోర్టు న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ 2023-24 సంవత్సారానికి అధ్యక్షుడిగా సరసం చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగన్, ప్రధాన కార్యదర్శిగా ఐనారి అశోక్, కోశాధికారిగా అరుణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శిగా సుఖేష్, మహిళా ప్రతినిధిగా దొండి సవిత ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్ సివిల్ జడ్జీ నసీమా సుల్తానా ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు జూనియర్ జడ్జి దీప్తీ, రెండో తరగతి జడ్జి వెంకటేష్, ఎన్నికల అధికారిగా గటడి ఆనంద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ స్వాముల రాస్తారోకో



నవీపేటలో రాస్తారోకో చేస్తున్న హనుమాన్ స్వాములు

నవీపేట: నవీపేట సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న ఇటీవల హనుమాన్ స్వాములపై అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ హనుమాన్ స్వాములు సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. మండలంలోని ఎలికె ఫారమ్ గ్రామంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ అబ్బన్న హిందువులను కించపరుస్తూ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్బన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని అడిగిన హనుమాన్ స్వామిని కూడా దూషించారని స్వాములు మండిపడ్డారు. హిందువులతో పాటు హనుమాన్ స్వాములకు క్షమాపణ చెప్పే వరకు రాస్తారోకో విరమించమని మొండికేశారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని ఎస్సై రాజారెడ్డి హామీ ఇవ్వడంతో హనుమాన్ స్వాములు శాంతించారు.

## ఆధ్యాత్మికం..

### శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపైగల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహంతో నిర్వహించిన పల్లకీ సేవా కన్నుల పండువగా సాగింది. అనంతరం ఆలయ ఆవరణలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

# సాంకేతిక రంగంపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొఫెసర్ నాగరాజు, అధ్యాపకులు

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థులు వివిధ సబ్జెక్టులతో సాంకేతిక రంగంపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన సెమినార్ పోటీల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు.వైర్‌లెస్, రోబోటిక్స్, వైరల్ ఎఫెక్ట్ ఆన్ హ్యూమన్, హ్యూమన్ ప్రాజెక్ట్-2022. రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇండియన్ బ్యాకింగ్ సిస్టమ్‌తో పాటు ఇతర అంశాలపై సెమినార్ నిర్వహించి పోటీలు నిర్వహించడం అభినందనీయం అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి రంగాల్లో రాణించడానికి తర్ఫీదు కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సెమినార్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు సాదియా ఫాతిమా, హలీమా సాధియా, షకీలోద్దిన్, రుహితబస్సుమ్, తోరణిలకు సర్టిఫెక్స్‌తో పాటు నగదు బహుమతిని అందజేశారు. చైర్మన్ సూర్యప్రకాష్, ప్రిన్సిపాల్స్ గంగాధర్, శైలజా, స్రవంతి, కో- కన్వీనర్స్ అశ్విని, ప్రశాంత్, అరవింద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### పడగల్‌లో పల్లెపల్లెకు ఆర్టీసీ



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో సోమవారం ఆర్మూర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో పల్లెపల్లెకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ ద్యావతి రాజ్‌కుమార్, ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాస్, జీపీ కార్యదర్శి సంజయ్ గ్రామంలోని దివ్యాంగులకు 50శాతం రాయితీ బస్‌పాస్‌ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఆర్టీసీలోనే ప్రయాణించాలని, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలకు గురికావద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

### చలివేంద్రం ప్రారంభం



రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో సోమవారం భారత సైనిక అమరవీరుల జ్ఞాపకార్థం వెంకన్న ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సర్పంచ్ కర్లం సాయరెడ్డి ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### నిరుపేద కుటుంబానికి చేయూత

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ కాలనీకి చెందిన సురేష్- అనిత దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు సంతానం కలిగారు. వీరిది పేద కుటుంబం కావడంతో పిల్లల పోషణ కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతీమా పేద కుటుంబానికి రూ. 1లక్ష ఖర్చు పెట్టి వారికి కావాల్సిన సరుకులు అందించారు. సహాయం చేసిన ఎమ్మెల్యే సతీమణికి సురేష్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

